క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న శివ లింగాలు


శ్వేత లింగం


పుష్పలింగం

పిఠాపురం: గొల్లప్రోలులో ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్వేత లింగం, పుష్పలింగాలు ఆకట్టుకుంటున్నాయి. మూడు రోజుల పాటు భక్తుల దర్శనాలకు అనుమతిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

3న రామాలయంలో విగ్రహ ప్రతిష్ట

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలో భక్తుల సహకారంతో నిర్మించిన భద్రాద్రి రామాలయంలో మార్చి మూడో తేదీన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్టు రామ భక్తుల గురుస్వామి వాసుదేవ సుబ్బారావు తెలిపారు. గ్రామంలో 14 ఏళ్ల క్రితం 20 మంది భక్తులతో ప్రారంభమైన భద్రాచల పాద యాత్ర 14వ ఏట ఇటీవల 200 మందికి చేరిందన్నారు. ఈ నెల 8న భీష్మ ఏకాదశి సందర్భంగా సీతారాముల రథంతో భక్తులు పాద యాత్రగా భద్రాచలం వెళ్లి స్వగ్రామాలకు తిరిగి వచ్చారు. వందలాది భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం వేగంగా పూర్తి చేసుకుంది. దీంతో విగ్రహ ప్రతిష్ఠ చేసి స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు సుబ్బారావు తెలిపారు.

పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్ర వర్షిణి

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్ర వర్షిణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ఇప్పటి వరకు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఓఎస్డీగా పని చేస్తున్నారు.

చికెన్, ఎగ్ మేళాకు భారీ స్పందన


చికెన్, ఎగ్ మేళా వద్ద క్యూ కట్టిన జనం

పెద్దాపురం: బర్డ్‌ఫ్లూ ఆందోళన నేపథ్యంలో చికెన్, కోడిగుడ్లు తినరాదని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రజానీకం వాటికి దూరంగా ఉంటున్నారు. 70 డిగ్రీల పైబడిన ఉష్ణోగ్రతతో ఉడికించిన ఆహారంలో బర్డ్ ఫ్లూ వైరస్ జీవించి ఉండలేదని తెలిపేందుకు మంగళవారం రాత్రి పెద్దాపురం రాజుగారి వీధిలో ఏర్పాటు చేసిన చికెన్, ఎగ్‌మేళాకు జనం ఎగబడ్డారు. ఉన్నతాధికారుల అనుమతులతో చికెన్ వ్యాపారులు సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు చికెన్ పకోడీ, కోడిగుడ్లు ఉచితంగా అందజేయడంతో ప్రజలు తినేందుకు క్యూ కట్టారు. సుమారు 2500 మందికి ఉచితంగా వాటిని పంపిణీ చేశారు.

పశువుల సంరక్షణపై దృష్టి పెట్టాలి

కొత్తపల్లి: పశువుల సంరక్షణపై పాడిరైతులు దృష్టి పెట్టాలని పిఠాపురం పశువైద్యశాల సహాయ సంచాలకుడు టీఎస్ రమేష్‌చంద్ర అన్నారు. మండలంలోని శ్రీరాంపురం శివారు ముమ్మిడివారిపోడులో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భాధారణ కార్యక్రమంలో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. వాటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఎస్. సుధీర్‌రెడ్డి, ఐ.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో సువార్త సభలు

పెద్దాపురం: ప్రపంచ శాంతి, ప్రజా శ్రేయస్సుకై వచ్చే నెల 3, 4 తేదీల్లో పిఠాపురం మండలం విరవ గ్రామంలో రక్షణ సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ అక్కడి జెడ్పీ హైస్కూల్‌లో రెండు రోజుల పాటు స్థానిక క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం ఎదురుగా ఉన్న మైదానంలో ఈ సభలో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామన్నారు.

లింగోద్భవానికి సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా పంచారామ క్షేత్రం
- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలో పంచారామ క్షేత్రం


కుమార రామభీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరి అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామ భీమేశ్వరస్వామి దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ప్రాచీన పంచారామక్షేత్రాలలో ప్రముఖమైన ఈ ఆలయం కాకినాడకు 14 కిలోమీటర్లు, రాజమండ్రికి 52 కిలో మీటర్ల దూరంలో గోదావరి కాలువ ఆవలి వైపు ఉంది. ఈ క్షేత్రం పూర్వం చాళుక్య భీమవరంగా ప్రసిద్ధి చెందినట్టు ఇక్కడి శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడు యోగలింగంగా సాక్షాత్కరిస్తారు. ఇక్కడి లింగాన్ని స్వయంగా కుమరస్వామి ప్రతిష్ఠించడంతో కుమారరామ భీమేశ్వరునిగా పిలుస్తారు. చారిత్మకంగా చూస్తే పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించిన్నట్లు తెలుస్తుంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య కుమారరామ భీమేశ్వరాలయంగా పిలుస్తున్నట్లు చెబుతారు. ఇక్కడి దేవేరిని బాలాత్రిపుర సుందరిగా పిలుస్తారు. మంగళవారం మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. బుధవారం రథోత్సవం, మార్చి ఒకటో తేదీ రాత్రి శ్రీపుష్పయోగోత్సవం నిర్వహించనున్నారు.

చైత్ర, వైశాఖ మాసాలలో సూర్యదేవుని సువర్ణ కిరణాలు ఉదయం పూట స్వామివారి పాదాలను, సాయం సంధ్యలో అమ్మవారి పాదాలను తాకేలా ఆలయ నిర్మాణం జరగడం విశేషం. ఈ దేవాలయానికి పడమర దిక్కున ఒక ఏక శిలాస్తంభం ఉంది. దీనిని స్థానికులు కప్ప స్తంభంగా పిలుస్తారు. ఆలయంలో మహాశివరాత్రితో పాటు కార్తిక మాసం ఇతర పర్వదినాలల్లో ప్రత్యేకంగా ఉత్సవాలు జరుగుతాయి.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి



భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. గోదావరి కాలువ, ఆలయ కోనేరుతో పాటు ఆలయ ముఖ ద్వారం వద్ద జల్లు స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేశాం. క్యూలైన్లతో పాటు గోదావరి కాలువపై మూడో వంతెన మీదుగా భక్తుల రాక పోకలకు సదుపాయాలు కల్పించాం. కెనాల్ రోడ్డు నుంచి ఆలయం వరకు లైటింగ్ ఏర్పాట్లు చేశాం.

– బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్ర ఈఓ, సామర్లకోట

పుణ్యస్నానాలకు పాదగయలో ఏర్పాట్లు


స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు


విద్యుత్ కాంతుల నడుమ పాదగయ పుష్కరిణి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న స్థానిక పాద గయ క్షేత్రంలోని మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి లక్ష కుంకుమార్చన, లక్షచామంతి పూజలతో సేవించారు. ఉదయం 8 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల పుణ్య స్నానాల కోసం పాదగయ క్షేత్రాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. మహాశివరాత్రి రోజున లక్ష మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారన్న అంచనాతో పుష్కరిణి చుట్టూ ఖాళీ ప్రదేశాన్ని విస్తరించారు. ప్రాచీన ప్రాశస్త్యం కలిగిన తీర్థం కావడంతో ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారు.

నేటి కార్యక్రమాలు

బుధవారం తెల్లవారు జామున 2 గంటల నుంచి స్వామి వారి నిజరూప దర్శనం. 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అమ్మవారికి కుంకుమార్జన ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 8 గంటల నుంచి స్వామివారి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌర్యం కలగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టు పక్కల అన్ని ప్రాంతాల్లోను సీసీ కెమెరాలు, డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

310 మందితో బందోబస్తు

ఏఎస్పీ మనీష్ దేవరాజ పాటిల్ పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, 11 మంది సీఐలతో పాటు, 21 మంది ఎస్సైలు, 250 మంది పోలీసు సిబ్బందితో పట్టణంలో అన్ని ప్రాంతాల్లో భద్రత ఏర్పాటు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ట్రైనీ డీఎస్పీ సుస్మిత బందోబస్తు పర్యవేక్షిస్తారన్నారు. వీరితో పాటు స్కాట్ టీంలు పని చేస్తాయన్నారు. ఆరు పార్కింగ్ ప్రదేశాలను నిర్దేశించామన్నారు. 4 డ్రోన్లు, 58 సీసీ కెమెరాలతో పరిస్థితిని సమీక్షిస్తామన్నారు. విలువైన ఆభరణాలు ధరించి రావద్దని ఆయన భక్తులకు సూచించారు.

పారిశుధ్యంపై వేడెక్కిన కౌన్సిల్

- తాగునీటి సమస్య పట్టించుకోండి
- పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడీ వేడి చర్చ


అధికారులకు ఆదేశాలిస్తున్న చైర్ పర్సన్ తులసీ మంగతాయారు

పెద్దాపురం: తాగునీటి సమస్యపైనా, పారిశుధ్యంపైనా అధికారుల నిర్లక్ష్య ధోరణిపై కౌన్సిల్ సభ్యులు దుమ్మెత్తిపోశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. పట్టణ తాగునీటి సరఫరాకు సంబంధించి సామర్లకోటలో 11 మోటార్లు ఉండగా మూడు మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన వాటికి మరమ్మతుల పేరుతో ఇంజినీరింగ్ అధికారులు బిల్లులు పెడుతున్నారు తప్ప పనులు జరగడం లేదని కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ ధ్వజమెత్తారు. పట్టణ పరిధిలో సైతం బూస్టర్ వద్ద ఒక్క మోటారు, మరో వాటర్ ట్యాంక్ వద్ద మోటారు రిపేరులో ఉన్నా, జనరేటర్ మరమ్మతులో ఉన్నా బిల్లులు చేసుకుంటున్నారే తప్ప ప్రయోజనం శూన్యమని ఆయన పేర్కొన్నారు. పారిశుధ్యం సైతం అధ్వానంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిపై చైర్మన్ తులసీ మంగతాయారు స్పందిస్తూ రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని కమిషనర్ పద్మావతిని ఆదేశించారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, పెంటకోట సత్తిబాబు మాట్లాడుతూ వడ్లమూరు రహదారిలోని ఆదివారం వారపు సంతలో రహదారిని ఆక్రమించి దుకాణాల నిర్వహణపై మాట్లాడుతూ ఆ దారిలోనే శ్మశాన వాటిక ఉండడంతో శవయాత్ర నిర్వహించే సమయంలో తీవ్ర ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో మార్కింగ్ చేయించి ఇబ్బంది లేకుండా చూస్తామని బదులిచ్చారు. చైర్మన్ తులసీ మంగతాయారు, కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం క్షీణించడంతో దోమల బెడద ఎక్కువైందని ఫాగింగ్ చేయించాలని సూచించారు. పారిశుధ్య సమస్యపైనే కౌన్సిలర్లు ఆరెళ్లి వీరరాఘవులు, దుర్గారావు, కనకదుర్గ ప్రశ్నలు సంధించడంతో కమిషనర్ స్పందిస్తూ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణను ఆదేశించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఓ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధికారుల పాల్గొన్నారు.

మార్చి 3న చలో కలెక్టరేట్

- మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా
- ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు మధు

సామర్లకోట: మున్సిపల్ కార్మికుల సమస్యల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 3న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పేరుతో దళారులుగా లబ్ధిపొందుతున్నారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా రోడ్లు శుభ్రం చేశారు. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్న సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి మార్చి ఆరున ఛలో విజయవాడకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు మార్చి 3 వరకు దశల వారి ఆందోళనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల మురళీ, నాయకులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ భూములు


ప్రభుత్వం సేకరించిన భూమిని పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

కొత్తపల్లి: పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా భూ కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమి కాపాడి, ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. మండలంలోని కొమరగిరి శివారు ఆనందనగర్ సమీపంలో గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించి చదును చేయకుండా ఉన్న భూమిని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం 71 ఎకరాల సాగుభూమిని కొనుగోలు చేసిందని, 31 ఎకరాల భూమిని లే అవుట్ చేశారని, మిగిలిన భూమిని చదును చేయకుండా ఖాళీగా వదిలేయడంతో కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పిఠాపురం ఎమ్మెల్యే తాలుకా అంటూ చెప్పుకుని సాగు చేస్తున్నారన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కె.గోవింద్, శేషారావు, అప్పన్న పాల్గొన్నారు.

రైతుల పేరు నమోదులో ఇక్కట్లు

- ఒకే ఎల్‌పీ నెంబరుతో అనేక మంది రైతులు
- ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్న వైనం


వీకే రాయపురం రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు

సామర్లకోట: రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవడంలో తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందాలంటే రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. దాంతో రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. పేరు నమోదు సమయంలో ఎల్‌పీ (ల్యాండ్ పార్సిల్) నెంబరుతో మరో రైతు ఉన్నాడని చెప్పడంతో వెనుదిరుగుతున్నారు. మంగళవారం సాయంత్రంతో పేర్ల నమోదు గడువు ముగుస్తుంది. వీకే రాయపురంలో ఈ సమస్య ఎక్కువగా ఉండటంతో రైతులు సర్వేయరుకు ఫోన్ చేస్తే తాను వేట్లపాలెం సర్వేలో ఉన్నానని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు. తమ పేర్లు నమోదు కాక పోవడంతో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందడం లేదని రైతులు ఇంటి వెంకట్రావు, వెలమర్తి బుల్లిరాజులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఏఓ ఐ.సత్యను వివరణ కొరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంఈఓ శివరామకృష్ణయ్య
- ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

సామర్లకోట: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ఉండూరు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన శిక్షణను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఇప్పటి వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు పొందిన శిక్షణపై సమీక్షించారు. అంగన్‌వాడీ టీచర్లు వినూత్న రీతిలో చిన్నారులకు బోధించడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. బృందాలుగా ఏర్పడి టీచర్స్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) తయారు చేసి తమ ప్రతిభ మెరుగుపరచుకోవడంతో పాటు ఎంఎల్‌ఓల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలందరికీ పాఠాలు నేర్పనున్నట్టు టీచర్లు వివరించారు. శిక్షణ ముగింపు సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్టు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమాలల్లో ఎంఈఓ 2 పి.పుల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ ఉష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి


పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ, సహాయ కలెక్టర్

పెద్దాపురం: ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పెద్దాపురం డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. డివిజన్‌లో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు. డివిజన్‌లో 31 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సామగ్రిని అందజేయడం జరుగుతుందన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు ఏడు రూట్లను ఏర్పాటు చేశామని, రూట్–1కు జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 13, 14, 15, 42, 43 పోలింగ్ కేంద్రాలు, రూట్–2కు ఏలేశ్వరం మండలంలోని 16, 17, 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రూట్–3కి కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాలు 34, 35, 19, 20 పోలింగ్ కేంద్రాలు, రూట్–4కి సంబంధించి శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 21, 22, 23, 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రూటు–5కు తుని మండలంలో 27, 28, 29, 30, 31 పోలింగ్ కేంద్రాలు, రూటు–6కు తొండంగి, కోటనందూరు మండలాల్లో 32, 33, 25, 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, రూట్–7కు పెద్దాపురం మండలంలోని 36, 37, 38, 39, 40, 41 ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. అనంతరం పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఇన్‌చార్జి ఆర్డీఓ, సహాయ కలెక్టర్ హెచ్ఎస్ భవానితో కలిసి పరిశీలించారు.